# సమాధి

రాజారావు ఉదయమే ఆ యింట్లో దిగాడు.

ఆ సాయంకాలం వీధి గదిలో కూర్చుని కథ రాసుకుంటున్నాడు.

రాజారావు రచయిత. పాఠకులలో ఆతని రచనలకొక విశిష్టతవుంది. బహుకొద్ది కాలంలోనే మంచి రచయితగా పేరు పొందాడు. చాలామంది రచయితల్లా అతని రచనల్లోనూ ఆవేశంపాలు అధికం. వాస్తవానికి ఎక్కువ ప్రాధాన్యత యిస్తుంటాడు.

ఇంట్లో దిగినరోజు బావుందికదా అని ఆరోజే కథ రాయడానికి కూడా ప్రారంభోత్సవం చేశాడు.

కథ పది పేజీల వరకు నడిచింది. సాలోచనగా సిగరెట్టు కాలుస్తూ కిటికీలోంచి అవతలకి చూస్తున్న వాడల్లా తక్కున ఆగిపోయి కలం పక్కన పెట్టి చూస్తూ కూర్చున్నాడు.

సన్నగా ఎర్రగావున్న ఒకామె అవతలి మేడమీది కిటికీముందు కూర్చుని దూరంగా దేన్నో చూస్తోంది.

కొద్దిసేపు చూసి మళ్ళీ కథ రాయడంలో నిమగ్నుడయ్యాడు.

చీకటి పడింది. అక్షరాలు కనిపించడంలేదు.

లేచివెళ్ళి లైటు వెలిగించి మళ్ళీవచ్చి కిటికీముందు కూర్చున్నాడు వట్టినే అలా బైటికి చూస్తూ.

అవతలి కిటికీలో మసకగా ఆమె ఆకారం యింకా కనిపిస్తూనే వుంది.

రాజారావుకు ఆశ్చర్యం వేసింది

'ఏమిటి చెప్మా ఆమె అలా చూస్తోంది?' అనుకున్నాడు విచిత్రంగా ఆమెనే చూస్తూ.

పనిమనిషి కాబోలు ఆ యింట్లో దీపం వెలిగించింది. గ్లాసులో ఏదో వంపి ఆమెకిచ్చి వెళ్ళిపోయింది. దానివంక క్షణంపాటు విచిత్రంగా చూసి, గడగడా తాగేసింది ఆమె.

రాజారావు డాబామీదకు వచ్చి ఆమె చూస్తున్నవైపుగా చూశాడు బైట ఊరినిండా అంధకారం నల్లని ముసుగు దుప్పటిలా కప్పివుంది. చెట్లు చేమలు, యిళ్ళు గుళ్ళు అన్నీ నల్లటి నీడల్లా నిలుచున్నాయి సగం సగం చీకట్లలో కరిగి. అక్కడక్కడ వీధుల్లో యిళ్ళల్లో దీపాలు వెలుగుతున్నాయి. అవి కొద్దిమేర వెలుతుర్ని సృష్టించి క్రమంగా చీకట్లలో కరుగుతున్నాయి. బజారులోను, వీధుల్లోను సందుల్లోను కార్లూ, బళ్ళూ, రిక్షాలూ, సైకిళ్ళూ పరుగెడుతూంటే విచిత్రంగా దీపాలు చీకటిలో మెరుస్తూ కదులుతున్నాయి.

అంతే! అంతకు తప్పించి యింకేమీ కనిపించలేదు. అటు ఏముందో ఊహించుకోవడానికైనా అతనికి ఆ వూరుతో పరిచయంలేదు.

చాలాసేపు అలానే నుంచున్నాడు.

ఆకలి జ్ఞాపకానికొచ్చింది.

డాబాదిగి, బట్టలు మార్చుకుని హోటలుకు బయలుదేరాడు.

ఇంటికి పదిగజాల దూరంలో కిళ్ళీకొట్టొకటుంది. వయసుమీరిన తాత కొట్టుమీద కూర్చుని బేరం చూసుకొంటూ వుంటాడు—

రాజారావు భోజనంచేసి వస్తున్నప్పుడు ఆ కొట్లో సిగరెట్లు కొనుక్కొని వచ్చాడు. ఆ రాత్రల్లా అతను కథను ముట్టలేదు.

ఆమె ఎదుటి కిటికీముందు రాత్రి చాలా పొద్దుపోయేవరకు అలానే కూర్చుని ఊరల్లా నిద్రపోయాక మెల్లగా కదిలిపోయింది.

రాజారావు ఆలోచనలతో నిద్రపోయాడు. విచిత్రమయిన కలలమధ్య ఉదయం మెలకువ వచ్చింది.

అప్పటికే సూర్యకిరణాలు కిటికీలోంచి మీదకు వాలుతున్నాయి.

బద్ధకాన్ని దులుపుకుని, మంచంమీద లేచి కూర్చుని కిటికీలోంచి చూశాడు.

ఆమె కిటికీముందు వుంది. స్పష్టంగా అవుపిస్తోంది. తలమీదకు ముసుగు తీసుకుని దూరంగా యిళ్ళ కప్పుల్ని దాటుకుని చూస్తోంది. ఉదయ కిరణాలు, చల్లని గాలి ఆమె శిరోజాల్ని, చెంపల్ని తాకుతూ పోతున్నాయి. గాలికి దిగజారిపోతున్న ముసుగుని సరిచేసుకుని కూర్చుంది.

గబగబా డాబామీదకు వెళ్ళి ఆమె చూస్తున్న వైపు చూశాడు.

రాత్రి చీకటిలో దాగిన ఊరంతా రొమ్ము విరుచుకుని వెలుతుర్లోకొచ్చి నుంచుంది. మీద కప్పుకున్న నల్లటి దుప్పటిని దూరంగా విసిరిపారేసి నవ్వుతూ ఎదుట వుంది. కొద్ది మేరతో ఆఖరయిన ఊరు, అవతల మెల్లగా కదులుతున్న గోదావరి, గట్టున స్మశానాలు, అక్కడక్కడ చెట్లు ఉన్నాయి.

ఆమె చూస్తున్నవైపు చెప్పుకోదగ్గ మేడలేదు. పెద్ద వీధి లేదు. మానవ అహంకారాన్ని నాశనం చేసేదీ, సర్వమానవ సమానత్వాన్ని నిరూపించేదీ ఆఖరి మంజిల్—స్మశానస్థలి ఉందక్కడ.

రాజారావు గట్టిగా ఊపిరితీసి విడిచి కిందకు వెళ్ళిపోయాడు. అతని మనసల్లా అనేక ఆలోచనలతో నిండిపోయింది.

సాయంకాలం ఆఫీసునించి వస్తూ కిళ్ళీకొట్టు దగ్గర ఆగి సిగరెట్లు కొనుక్కున్నాడు. ఒకటి కాలుస్తూ అలాగే నుంచున్నాడు చాలా సేపు.

ఇంతకూ ఆమె ఎవరు? ఎందుకలా చూస్తుంటుంది?—వివరాలు తెలుసు కొందామని అతని కోరిక. తాతతో యీ రెండురోజుల్లోనూ కొద్దిపాటి పరిచయం ఏర్పడింది. తాతకు కూడా బేరాలు లేవు. ఖాళీగా కూర్చోలేక రాజారావును కదిపి పెరిగిపోతున్న ధరలగురించి మాట్లాడుతున్నాడు!

"చూడుతాతా, ఆవిడెవరు?" అన్నాడు రాజారావు సమయం కనిపెట్టి.

తాత రాజారావువంక అదోలా చూశాడు.

ఆ తర్వాత "పాకిస్థానీవాళ్ళ పిల్లబాబూ! పాపం భర్త పోయాడు. ఆమె భర్త శేట్ కపూర్‌చంద్ అని పెద్ద వడ్డీ వ్యాపారి. అకస్మాత్తుగా ఒకరోజు గుండె ఆగి చనిపోయాడు" అన్నాడు తాత.

"పాపం!" అన్నాడు సానుభూతిగా రాజారావు.

అది అతనికే ఆశ్చర్యం వేసింది. ఆమె ఎవరో ఎలాటిదో ముక్కూ మొహం ఎరక్కపోయినా ఆమెమీద సానుభూతి చూపించడానికి కారణమైన దేమిటో అతనికే అర్థంకాలేదు.

ఇంటికి వెళ్ళి 'ఆమెమీద కథ వ్రాయలేనూ' అని ప్రశ్నించుకున్నాడు.

కాని ఆమెను గురించి ఏమని వ్రాయడం?

ఆమె జీవితం గురించి తనకేం తెలుసు!

అయినా ఊహించి కథావస్తువును సగంవరకు సంపాదించుకున్నాడు.

ఆమె చాలా పేద కుటుంబంలో పుట్టింది. దరిద్రంలోనే ఆమె యవ్వనాన్ని తొడుక్కుంది. పుట్టిన దగ్గరనుండి నిరాశా నిస్పృహలతోను, దారిద్ర్యంతోనూ, గొప్పవాళ్ళ కనుసన్నల్లోనూ పెరగడంవల్ల జీవితానికి స్వేచ్ఛ, ఆనందం అనేవి లేకుండా పోయినయ్. అందాన్ని కృత్రిమంగా అధికంచేసి నలుగురికీ చూపే స్తోమత లేకపోయింది. మూలుగుతూ మూలకూర్చుని జీవితాన్ని అసహ్యించుకునేది. నిజంగా ఆమెకు జీవితంమీద ఆసక్తిలేదు. బతకాలనే కోరికాలేదు. ఆమెవల్ల అందరికీ బాధగావుండేది. పెళ్ళి చేయలేక కన్నతండ్రి దిగాలుపడిచూస్తూ కూతురు కళ్ళముందు కనిపించినప్పుడల్లా గుండె బాదుకుంటున్నాడు. చుట్టూవుండే కాకిమూక కొరకొరా చూస్తోంది.

వాళ్ళ చూపులు, మాటలు శూలాల్లావచ్చి గుచ్చుకునేవి. ఏమి చెయ్యడానికీ ఆమె అశక్తురాలు. జీవితంతో పోరాడి పోరాడి అలసి ఆశలన్నీ నాశనం చేసుకుని, కోరికల్ని చంపుకుని, మమతల్ని కాదని ఒక అర్ధరాత్రి ఎవరికీ తెలియకుండా ప్రాణత్యాగం చేసుకుందామని బయలుదేరింది.

కాని ఆమె ప్రయత్నం ఒకతను చూశాడు. రక్షించి యిల్లు చేర్చాడు. ఆమె కథంతా విన్నాడు. జాలిపడ్డాడు. ఓ రోజున బ్రహ్మాండంగా వివాహం చేసుకున్నాడు.

ఆమె తన అదృష్టాన్ని తలంచుకుని మురిసిపోయింది. అతన్ని దేవుడిలా ఆరాధించింది. చిలకాగోరింకల్లా కాపురం చేస్తున్నారు వాళ్ళిద్దరు.

అంతలోనే మతోన్మాదంతో విద్వేషాలు చెలరేగి హత్యలు, లూటీలు, గృహదహనాలు దేశమంతటా విస్తరించాయి. అక్కడ వుండడం ప్రమాదమని

భావించి ఇంటిని డబ్బుని సర్వాన్నీ విడిచి అందరితోపాటు వాళ్ళు యీ దేశం లోకి పారిపోయి వచ్చారు. జీవనోపాధికై దేశమంతా తిరిగి చివరికి యీ ఊళ్ళో నివాసమేర్పరచుకున్నారు. నాలుగురాళ్ళు సంపాదించి గడచినగాథలు మరచి జీవిస్తుంటే అకస్మాత్తుగా ఆమె ఆశల్ని అడియాశలు చేసి, ఆమె ఆనందాన్ని కన్నీరుగార్చి, ఆమె భవిష్యత్తును అగాధంచేసి, శేష జీవితాన్ని ఒక్కర్తినీ గడపమని ఒకరోజు అకస్మాత్తుగా గుండెజబ్బుతో అతను కళ్ళు మూశాడు. నిర్జీవంగా ఆమె మిగిలింది.

— రాజారావు కథా సంవిధానాన్ని సగంవరకు ఊహించాడు. ఆటు తర్వాత అతని ఆలోచనలు యిక సాగలేదు. అన్నీ అంతవరకు వచ్చి ఆగి పోయాయి. ఇదంతా ఆమె గతజీవితంగా భావించి శేషజీవితాన్ని దీనికి జత చేర్చుదామనుకున్నాడు.

కాని చిన్న సందేహం కలిగింది. మిగిలిన ఆమె జీవిత చరిత్రలో ఎన్ని పుటలు వెలువడుతాయోకదా. వాటన్నిటినీ సేకరించడం వీలవుతుందా అని.

కాని అతని మనసు అలా జరగదని చెప్తోంది.

ఆమె జీవితంలో యిక మార్పు వుండదు. ఈరోజు దినచర్యే రేపటి దినచర్యకూడా! మరో ఏడాదిపోయినా అదే! ప్రొద్దున్న లేవడం, కిటికీ ముందు కూర్చోవడం, వేళకు భోజనం చేయడం, నిద్రపోవడం — అంతే! ఒకవేళ ఆమె దినచర్యలో ఏమయినా మార్పువచ్చి ఆమె జీవిత చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తే అదే ఆ చరిత్రలో అంతిమ అధ్యాయం.

సెకండ్‌షో సినిమాకు వెళ్ళివచ్చాడు రాజారావు. వెంటనే నిద్రపట్టలేదు. అరగంటసేపు మంచంమీద అటూ యిటూ దొర్లాడు. మెల్లగా నిద్రపడుతోంది.

బయట ఎవరో భయంకరంగా దగ్గుతున్నారు ఆ శబ్దం నిశ్శబ్దంలో ప్రతిధ్వనించింది. గాలిలో ఎగిరి వీధల్లా చుట్టివేసింది.

రాజారావు నిద్ర తేలిపోయింది.

ఖంగుఖంగున దగ్గుతూన్న ఆ శబ్దం అంతటితో ఆగిపోలేదు, వరసగా వినిపిస్తూనే వుంది. మధ్యమధ్య సన్నగా మూలుగు.

లేవడానికి బద్ధకంవేసి, ఆ శబ్దాన్ని వింటూ ఎప్పుడో నిద్రపోయాడు.

ఉదయం ఆఫీసుకు వెళ్ళేముందు ఎదుటింటి పనిమనిషి మందుసీసా పట్టుకొని వస్తూవుండడం చూసినప్పుడు అంతా అర్థమైంది. రోజూ ఆమెచేత పనిమనిషి తాగించేదేమిటో తెలిసింది.

ఆమెమీద జాలి పుట్టుకొచ్చింది రాజారావుకు. ఏమయినా ఆమెకు సాయంచేస్తే బావుండునుకదా — అనిపించింది అతనికి.

కాని తను చేయగలిగేదేమిటి ?

ఇతరులు తనను చూసి జాలిపడి సానుభూతి చూపించి సాయం చేయవలసిన అవసరం ఆమెకేముంది ?

ఆర్థికంగా ఆమె చాలా గొప్పది. ఆయన చనిపోతూ వదలిపోయినడబ్బే చాలావుంది.

ఏ పనయినా ఆమె చెప్తే చేసేవాళ్ళు ఆ వీధినిండా వున్నారు. ఇక తనవల్ల ఆమెకు జరిగే పనేమిటి ? ఆమెమీద జాలివల్ల అలా అనిపిస్తోంది. అయినా ఆమెను చూడడం అది ప్రారంభంగనుక, ఆమె ప్రవర్తనలన్నీ వింతగా వున్నాయి. ఆమె గురించి తరచు ఆలోచించాల్సివస్తోంది. ఆమె అంటే ఒక విధమయిన అభిప్రాయం, గౌరవం. ఆ జీవితంమీద జాలి, సానుభూతి.

కాని నెలగడిచేటప్పటికి ఆమె అలవాట్లతో అతనికి సంబంధం లేకపోయింది. యంత్రంలాటిది ఆమె జీవితం గనుక కొత్తగా జ్ఞాపకం వుంచుకోవాల్సిన విషయాలు ఏమీలేవు. అలవాటు అయిపోయిందిగనుక మునుపటిలా బాధకూడా కలగడంలేదు. ఆమెను చూస్తూనే వెళ్ళిపోతున్నాడు ఆమె ఆలోచనే లేకుండా. రాత్రల్లా ఆమె భయంకరంగా దగ్గిదగ్గి సొమ్మసిల్లి పడిపోతే చూసి పెద్దగా చలించేవాడుకాదు. డాక్టరు ఆదుర్దా, పనిమనిషి ఆవేదన, ఆమెబాధ ఒక్కక్షణంపాటు మాత్రం కదిల్చి కరిగిపోయేవి. ఒక్కొక్కప్పుడు అనుకునేవాడు—అదేమిటి ! నాకు పిచ్చెక్కుతోందా ఏం, ఆపిడగురించి నేనెందుకు బాధపడుతున్నాను—అని.

ఒకరోజు ఒక్కడూ సాయంకాలం షికారుకు బయలుదేరి వీధిమలుపు తిరుగుతుండగా శర్మ కనిపించాడు.

ఇద్దరూ మాట్లాడుకొంటూ గోదావరి గట్టెక్కి నడుస్తున్నారు.

గట్టున గాలి చల్లగా వీస్తోంది. నదిలో నీళ్ళు రాళ్ళ సందుల్లోపడి కిందకు జారుతున్నాయి. కుర్రాళ్ళు నీళ్ళల్లో దిగి ఆడుకుంటున్నారు. పడవలు వాలుగా జారుతున్నాయి. వాటిని చూసుకుంటూ లోగడ అచ్చయిన రాజారావు నవలలోని "సుశీల" పాత్రను గురించి చర్చిస్తూ గట్టువెంబడే చాలాదూరం వెళ్ళిపోయారు.

మీద సన్నగా చినుకులు పడేవరకు వెనక్కు మళ్ళాలని జ్ఞాపకం రాలేదు.

తీరా వెనక్కు తిరిగి ఆదుర్దాగానడుస్తూ వస్తోంటే వర్షం ముదిరి బట్టల్ని తడుపుతోంది. ఎక్కడా ఆగడానికికూడా వీలులేకపోయింది. గట్టుమీద చెట్లు గాని, గట్టుకింద పాకలుగాని లేవు.

అదంతా స్మశాన ప్రదేశం.

ఇంకాస్త దూరం వెళ్ళితే గట్టుపక్కనే సత్రవొకటుంది.

ఇద్దరూ పరుగెత్తుకొని అక్కడకు చేరారు వర్షంలో సగంసగం తడిసి.

అరగంటసేపు కుండపోతగా వర్షం కురిసి తగ్గిపోయింది.

అంతవరకు ఇళ్ళల్లో వొదిగిన మనుషులు బైటికొచ్చి ఆకాశంవంక చూసి నడక ప్రారంభించారు.

ఆగిపోయిన యంత్రం మళ్ళీ కదిలినట్టుగా ఊరంతటా ఓమారు చైతన్యం కనుపించింది.

బళ్ళు, కార్లు, రిక్షాలు మళ్ళీ ఊరివీధుల్లో పరుగెత్తాయి.

రాజారావు వెళ్ళిపోదామని గట్టు దిగబోతున్నవాడల్లా తిరిగి చటుక్కున ఆగిపోయాడు.

ఏమిటి? అన్నట్టుగా చూశాడు శర్మ! రాజారావు ముఖంలోకి.

"అబ్బే, ఆ పేరు చూస్తున్నాను, ఎక్కడో విన్నట్టనిపిస్తేను" అన్నాడు రాజారావు అక్కడి పాలరాయి పలకను చూపిస్తూ.

"ఏమిటి! శేట్ కపూర్‌చంద్ పేరా. బహుశా చాలాసార్లు వినేవుంటావు. పేరుమోసిన వడ్డీవ్యాపారి. చనిపోయిన తర్వాత ఆయన పేరుమీద కట్టించారు

గాబోలు. అదిగో ఎదురుగావున్న ఎత్తయిన ఆ సమాధి ఆయనదే .... పేరు కనిపిస్తోందిగా చూడు" అన్నాడు శర్మ.

"ఓహో ఆవిడ భర్తా!" ఆశ్చర్యపోయాడు రాజారావు.

శర్మకు అర్థంకాలేదు. విచిత్రంగా మిత్రుడ్ని చూశాడు.

రాజారావు అయిదు నిమిషాలు అలా ఆ అక్షరాల్నే చూస్తూ మౌనంగా కదిలిపోయాడు.

ఊర్లోకి వచ్చాక పనుందని వెళ్ళిపోయాడు శర్మ. రాజారావు ఒక్కడూ అడుగుల్లో అడుగులు వేసుకుంటూ తాత కిళ్ళీకొట్టువరకూవచ్చి ఆగిపోయాడు.

'రాబాబూ' అన్నాడు తాత. అలవాటు ప్రకారం అరపెట్టె సిగరెట్లు యిచ్చాడు.

రాజారావు అందుకొంటూ అడిగాడు "చూడుతాతా! స్మశానాల దగ్గర సమాధుల కెదురుగా సత్రవ ఒకటుందికదా. అది ఈ శేటుగారిదేనా?"

తాత మెల్లగా తలవూపాడు. ఓమారు బరువుగా నిట్టూర్చాడు. "అవును బాబూ, ఆయనదే. ఎంత మంచివారనుకున్నావ్. నిజంగా ధర్మదాత. నాకొట్టు యీ రోజు యిలా నిలబడడానికి కారణం ఆయనేబాబూ. మాఆవిడ ఆయింట్లో పనిచేస్తుంటాది. ఒకరోజు వందరూపాయలు అప్పు అడగమని పంపించాను. అడగ్గానే తెచ్చి చేతుల్లో పెట్టారు. అప్పటికి నాకు ఏ పనీలేక తింటూ కూర్చునే వాడిని. ఆ డబ్బుతెచ్చి యిలా యీ కొట్టు పెట్టాను. దీనితోనే యింతవరకు నెట్టుకొస్తున్నాను. ఏదో_యిప్పటికి తిండికి ఏలోటూ లేకుండా గడిచిపోతోంది.

ఇంతకాలం అయిపోయినా ఎప్పుడూ ఆ డబ్బు విషయం వాళ్ళు ఎత్తి లేదు. ఆయన చనిపోయాక డబ్బు తీసుకెళ్ళి ఆయమ్మ చేతుల్లో పెట్టాం. 'ఎందుకు సత్తులూ, ఈ డబ్బు నేనేం చేసుకోను? మీదగ్గరుంటే వ్యాపారంలో తిప్పుకోడానికయినా ఉపయోగిస్తుంది. వారు యిచ్చినందుకు, మీరు పుచ్చు కున్నందుకు తగిన ఫలితం వచ్చింది. మీ యిల్లు నిలబెట్టుకోగలిగారు. అంత కన్నా కావలసినదేముంది. మీకు యిచ్చినడబ్బు వారు మళ్ళీ తీసుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు. వారికి యిష్టంలేని పనిని నేనుమాత్రం ఎలా చెయ్యను'

అంది. చూశావా బాబూ, వారికి మేమంటే ఎంత ప్రేమో! అంతమంచి మనుషులు చాలా అరుదుగా వుంటారు'' అన్నాడు తాత.

ఒక అయిదు నిమిషాలు ఊరుకుని చుట్టతీసి వెలిగించి మళ్ళీ ప్రారంభించాడు.

"మత కల్లోలం సమయంలో భూముల్ని పుట్టల్ని, ఆస్థిని యింటిని — అన్నిటినీ వదిలి పారిపోయి వచ్చేశారు. దారిలో శేటుగారి తల్లి, ఆఖరి తమ్ముడు ఆకలిదప్పులకు తాళలేక నీరసించి రోగంవచ్చి చనిపోయారట. వీరిద్దరు మాత్రం ఎల్లాగో ప్రాణాల్ని దక్కించుకుని తిన్నగా యీ వూరువచ్చి, ప్రభుత్వం వారివద్దనుండి డబ్బుసాయంపొంది కొద్దికొద్దిగా కోలుకున్నారు. ఆయనకు బంధువులెవరూ లేరు. చెట్టుకొకరు, పుట్టకొకరు చొప్పున తలా ఒక దారి అయిపోయారు. ఆమెకు మాత్రం ఒక అన్న వున్నాడు. బొంబాయిలో యిప్పుడు లక్షాధికారి. అతనూ మతకల్లోలంలో పారిపోయివచ్చేసి బొంబాయిలో బట్టల వ్యాపారంచేస్తూ, చెల్లెలిగురించి అన్నిచోట్లా వాకబుచేసి కనుక్కొని ఓ మారు చూడ్డానికి వచ్చాడు. ఆమె భర్త చనిపోయాక ఆయన తన చెల్లెల్ని తీసుకుపోదామని చూశాడు కాని ఆమె వెళ్ళనంది. తన భర్త చనిపోయిన స్థలంలో పవిత్రమయిన గోదావరివద్దున ఆయన సమాధి పక్కనే తన సమాధి లేవాలని ఆమె సంకల్పం. మిగిలిపోయిన తన జీవితకాలాన్ని ఇక్కడే గడిపేయాలని ఆమె కోరిక. ఆయన పేరుమీద చక్కటి సత్రం ఒకటి కట్టించింది. అనేక సంస్థలకు తన ఆస్థిని దానం చేసింది. ఆమెకు జీవితంలో ఇక కోరికలేవీలేవు, తన భర్తను తలచుకొంటూ హాయిగా కళ్ళుమూయడంతప్ప. అయినా ఆమెకూడా యిక ఎంతోకాలం బతికేట్టులేదు. చూస్తుండగానే ఎప్పుడో ఒకప్పుడు దగ్గర్లోనే గుటుక్కుమంటుంది. భర్త పోయాక ఎప్పుడూ అతనినే తలంచుకుని కుమిలిపోతూ ఆరోగ్యాన్నీ, ఆహారాన్నీ నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుతం ఆమెకు క్షయ జబ్బు. ఆ భయంకర రోగం ఆమెను వదలడంలేదు. ఏమయినా ఆమెను కొద్దిరోజులు మాత్రమే మనం కళ్ళముందు చూసేది."

తాత కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. గొంతు బొంగురుపోయింది. రాజారావుకి తన ముఖం కనబడకుండా పక్కకు తిప్పుకున్నాడు.

రాజారావు తాత పరిస్థితి గ్రహించాడు. వస్తానుతాతా అనిచెప్పి మెల్లగా అక్కడనుండి బయలుదేరాడు.

గదిలోకొచ్చి కూర్చున్నా అతని ఆలోచనలు ఆమెను విడిచిపెట్టడం లేదు. భర్తమీద ప్రేమకు, ఆ ప్రదేశంమీది అభిమానానికి అతనికి ఆశ్చర్యం వేసింది.

ఎంత ఆదర్శప్రాయమైన జీవితం! తన భర్త ఆత్మశాంతికి, తన మనస్సుకు సంతృప్తికి తను యిక్కడేవుంటూ ఆయన్ని తలంచుకుంటూ కళ్ళు మూయాలనే కోరికలో ఎంత ప్రేమ, త్యాగం యిమిడి ఉన్నాయి! తన భర్త తనకు ఎక్కడ ఆనందాన్నీ, అనురాగాన్నీ యిచ్చాడో అక్కడే నైరాశ్యాన్నీ, నిట్టూర్పునూ వదిలి తనను నిర్జీవాన్నిచేసి వెళ్ళిపోతే ఆ ప్రదేశంమీద ఆమెకు ఎందుకంత మమత? ఎక్కడో సింధ్‌లోని 'షికార్ పురుష్'లో పుట్టి, ఆ హిమానీ నది సింధూ శీతల జలాల్ని తాగి పెరిగి, యిక్కడ యీ గోదావరి పవిత్ర గంగలో కలవాలనే ఆమె కోరిక ఎంత మహోదాత్తమైనది!

వర్షాకాలం నిండుగా, ఉధృతంగా గోదావరి ప్రవహిస్తున్నప్పుడు, దాని హద్దుల్నిదాటి స్మశానాల్లోకి చొచ్చుకువచ్చినప్పుడు, దానివడ్డున సమాధుల్లోని తమ శరీరాలు సరిగంగస్నానాలు చెయ్యాలని కాబోలు ఆమె కోరుతూంట!

రాజారావుకు ఆమెమీద చాలా మంచి అభిప్రాయం ఏర్పడింది.

ఆమెను గురించి ఆలోచించి తనెందుకు బాధపడాలి అని ఒకనాడు నిర్ణయించుకుని తన ఆలోచనల్లో, చూపుల్లో ఆమెను తప్పుకు తిరిగినవాడు మళ్ళీ క్రమక్రమంగా ఆమెకు సన్నిహితమౌతున్నాడు.

అతని ఆలోచనలు ఆమె జీవితంవైపు, చూపులు ఆమెవైపు పరుగెత్తుతున్నాయి అతనిలో సానుభూతి, బాధ, భయం కలిగి కొద్దిసేపు అతన్ని వశపరచుకుని వెళ్ళిపోతున్నాయి.

ఉదయంలేస్తే ఆమె ఆలోచన!

ఆఫీసుకు వెళ్ళినా, భోజనం చేస్తున్నా, ఏకాంతంగా కూర్చున్నా, నిద్ర పోకున్నా అవే ఆలోచనలు—అన్నీ ఆమెను గురించే!

మనసు మరో విషయాన్ని ఆలోచించడంలేదు. ఎంతసేపూ ఆమె, ఆమె జీవితం!

దీనంతటికీ కారణం తన ఏకాంతతే అనిపించింది. ఒంటరిగా వుండడం వల్ల వేరే ధ్యాసలేకుండా తన ఆలోచనలన్నీ ఆమె వెనుకనే పరుగెడుతున్నాయి అనుకున్నాడు.

ఆ ఆలోచన కలగగానే తన మామగారిమీద, భార్యమీద ఎక్కడలేని కోపమూ వచ్చింది. రెండు ఉత్తరాలు రాసినా రమని యింకా పంపనందుకు మొత్తంమీద అక్కడివాళ్ళందరి మీదా కోపం వచ్చింది.

ఆ కోపం తగ్గిపోకుండానే ఆ వెంటనే కూర్చుని మామగారి పేర, భార్య పేర ఉత్తరాలు వ్రాసి అప్పటికప్పుడే పోస్టుచేసి వచ్చాడు. దీనితో తిక్క కుదురుతుంది, రాకేంజేస్తుంది — అనుకుని హాయిగా రాత్రికి నిద్రపోయి ఉదయం లేచి కోపాన్ని మర్చిపోయి యధాలాపంగా ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

సాయంకాలం ఆఫీసునుంచి తిరిగివస్తోంటే తాతపిలిచి "చూశావా బాబూ! ఆమె తన దగ్గర మిగిలిన ఆస్తినంతా, తను చనిపోయాక, శాశ్వతంగా ఉందేలా అదేదో శరణాలయానికి రాసేసిందట!" అన్నాడు.

మర్చిపోతున్న ఆ విషయాన్ని జ్ఞాపకంచేసి తనకు బాధ కలిగించినందుకు తాతమీద కోపం రాలేదుకాని ఏడుపు వచ్చింది.

ఇంకొద్దికాలంపోతే ఆమెను గురించి యిక నువ్వు ఆలోచించనక్కర లేదు. ఉన్న యీ కొద్దిపాటి కాలంలోనైనా సానుభూతయినా చూపించడానికి బాధపడతావేమిటి?—అని మనసుని కసురుకున్నాడు రాజారావు.

"ఏమయినా మెఆ చనిపోవడమే మంచిది నాయనా. వుండిమాత్రం సుఖిస్తుందాయేం. దినదిన గండం నూరేళ్ళాయుష్షులా ఎందుకూ బతకడం! ఎంతసేపూ ఆ రోగంతో బాధపడడంతప్ప ఆమె ఏం సుఖపడుతోంది. ఒక వైపు భర్త ఆలోచనలతో కృశించిపోతూ, మరోవైపు రోగంతో మూలుగుతూ బాధపడుతూ ఎంతకాలం జీవించివుంటుంది!"

"అవునవును. నాకూ అలాగే అనిపిస్తోంది తాతా .... అదే మంచిది" అంటూ వెళ్ళిపోయాడు రాజారావు.

ఏమిటి! తను చనిపోవాలనుకుంటున్నాడా ఆమెను? ఆశ్చర్యపోయాడు రాజారావు తన ఆలోచనలకి.

మరి .... చనిపోకుండా బతికివుండి మాత్రం ఆమె చేసేదేమిటి? తాత మాటల్లో ఎంతో నిజంవుంది....అవును. ఆమె చనిపోతేనే ఈ బాధలు, బరువులు అప్పుడామెకు వుండవు. ఇప్పుడామె కళ్ళుమూసినా గుండెలు బాదుకుని ఏడ్చే బంధువులులేరు. ఏకాకిజీవితం వుంచేనే పోతేనేం—అనుకున్నాడు రాజారావు.

అలానే ఆలోచిస్తూ ఎప్పుడో నిద్రపోయాడు.

ఆ రాత్రంతా విచిత్రమైన కలలతో నిండిపోయింది.

గడ్డకట్టిన అతని ఆలోచనల ఐసు ముక్కలు కలల నీళ్ళలో తేలుతూ దూరదూర తీరాలకు ప్రయాణం చేశాయి. వెండిలా తళతళలాడే తెల్లని ఇసుక రేణువుల ఒకానొక తీరం ఆవలివైపున గుబురుగా పెరిగిన రెల్లుగడ్డి మధ్య శోకిస్తోన్న ఒక స్త్రీ ఏకాంతంగా కనిపించింది. అతను స్వచ్ఛమైన నీళ్ళల్లో వెన్నెల రాత్రి వొక్కడూ విహరిస్తూ ఆమెనుచూసి ఆశ్చర్యపోయి పలకరించాడు. ఆమె వలవలా ఏడ్చి, తనను అక్కడనుండి దూరంగా ఎక్కడికో తీసుకుపోయి వదిలిపెట్టమంది. అతను అలానేచేసి వెళ్ళిపోతూ నాలుగడుగులు వేసి ఓమారు వెనక్కి తిరిగిచూస్తే ఆమె అక్కడలేదు. అదృశ్యమైపోయింది!

అంతలోనే కొద్దికొద్దిగా తెలివి....మళ్ళీ అర్థంపర్థంలేని ఓ కల.

ఆ కలల్లోని స్త్రీ ఆకారాలు ఆ ఎదురింటి ఆమె రూపాలు!

రెండుమూడు రోజులుగా ఆమె పరిస్థితి మరీ ప్రమాదకరంగా వుంటోంది. రాత్రింబవళ్ళు ఎడతెరిపిలేకుండా దగ్గు తెరల్తో సతమతమవుతోంది.

బాధతోవేసే భారమైన మూలుగులు అస్తమానం వినిపిస్తున్నాయి.

అయినా ఆమె కిటికీముందు కూర్చోవడం మానలేదు.

కిటికీముందు మంచంమీద కూర్చుని దగ్గుతెర వచ్చినప్పుడు మంచం మీద వాలి, లేనప్పుడు కూర్చుని యిళ్ళ కప్పుల కావల స్మశానాల కివల ఎత్తయిన ఆ సమాధి శిఖరాన్ని చూస్తూ అలాగే వుంటోంది.

డాక్టరుకూడా రోజుకు మూడుసార్లయినా వస్తున్నాడు. ఏవో ఇంజక్షన్లనీ, మందుల్నీ యిచ్చి వెళ్ళిపోతున్నాడు. అతని ముఖంలో సంతోషం లేదు.

ఒక రోజున జట్కాబండివచ్చి ఆ యింటిముందు ఆగింది. లోపలి నుండి నలభైఏళ్ళ పైబడ్డతనూ, అతని భార్యా పిల్లలూ దిగి సామానుల్ని తరలించుకుని ఎదుటి మేడలోకి వెళ్ళిపోయారు.

రాత్రి భోజనంచేసి వస్తున్నప్పుడు తాత పిలిచి చెప్పాడు, "వాళ్ళన్నయ్య వచ్చాడుబాబూ" అని.

"ఆమెను బొంబాయి తీసుకుపోయి అక్కడ పెద్ద డాక్టర్లకు చూపిద్దామని అతను వచ్చాడు. ఆమె మాత్రం యిక్కడనుండి కదలనని ఒకటే పట్టు పడుతోంది. వెళ్ళితే ఏమన్నా బాగుపడవచ్చేమో మరి" అన్నాడు తాత తిరిగి.

రాజారావు ఏమీ మాట్లాడలేదు. కాస్సేపు అక్కడే నుంచొని సిగరెట్టు కాల్చుకుని యింటికి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రికే అతను ప్రయాణమై భార్యను తీసుకుని రావడానికి బయలు దేరాడు. వారం రోజులపాటు ఆఫీసుకు శెలవుపెట్టిరమ్మని ఉదయమే మామ గారి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది.

పెళ్ళయిన కొత్తలో మూడు నాలుగుసార్లు ఏంవెళ్ళాడో అంతే! మళ్ళీ ఆ వూరు వెళ్ళలేదు.

మామగారు ఆ విషయాలన్నీ వ్రాస్తూ 'ఒక వారం రోజులపాటు సెలవు పెట్టివస్తే యిక్కడ మా అందరికీ సంతృప్తిగా వుంటుంది. అలా వెళ్ళేటప్పుడు అమ్మాయినికూడా వెంటబెట్టుకుని వెళ్ళొచ్చు' అన్నారు.

వారం రోజులు ఎందుకులే అనుకుని నాలుగు రోజులు శెలవుపెట్టి బయలుదేరాడు.

తీరా వెళ్ళిన తర్వాత వారం రోజులు వుండక తప్పలేదు.

అక్కడున్న ఆ వారం రోజులు పిండివంటలు కబుర్లు కాలక్షేపాలతో సంతోషంగా గడిచిపోయింది. పూర్తిగా ఆ సింధీ ఆమెను మర్చిపోయాడు. ఆ తర్వాత ఆ విషయాలన్నీ ఆలోచించినప్పుడు ఆమెను అంత తేలిగ్గా మర్చి పోయినందుకు అతనికే ఆశ్చర్యం కలిగింది.

ఏడోరోజున భార్యను వెంటబెట్టుకుని ప్రయాణం కట్టాడు. కొత్త యిల్లు, ఒంటరి సంసారం దిగులు ఆమెను ఆవరించింది. అయినా భర్తతో వుంటూ వుండడం అదో ఆనందం.

బండిలో పుట్టెడు పుట్టింటి విషయాలు భర్త ముందు వెళ్ళగక్కింది.

రాజారావు వింటూ కూర్చున్నాడు. అతనికి నిద్రవస్తోంది. ఆమె నోరు కట్టివేస్తే కాస్సేపు కళ్ళు మూద్దామనుకున్నాడు. ఆమె అదేమీ గమనించడం లేదు. రెండు నిమిషాలు ఊరుకున్నట్టే ఊరుకుని ఆ తర్వాత—

"ఇంట్లో ఒక్కరూ ఎలావుండేవారండీ! కన్నవారింట్లో అంతమంది అక్క చెల్లెళ్ళు, ఒదినా మరదళ్ళూ వున్నా ఎప్పుడూ నాకు వెలితిగా బద్ధకంగా అదోలా వుండేది" అంది.

కళ్ళు మూసుకుని నిద్రపోదామనుకుంటున్నవాడల్లా రాజారావు ఓమారు బద్ధకాన్ని దులుపుకొని నిటాగ్గా కూర్చుని—

"ఎంత చక్కటి కాలక్షేపం అనుకున్నావు! ఇంట్లో దిగిన దగ్గరనుండీ ఏకాంతమే అనిపించలేదు. రోజులన్నీ నాకు తెలీకుండానే విచిత్రంగా దొర్లి పోయాయి! నిజంగా ఆ ఎదుటింటి ఆమె ఒక చక్కటి కాలక్షేపం" అన్నాడు.

"ఆమె ఎవరు?" ఆశ్చర్యంగా, అసూయగా అడిగింది రాజారావు భార్య.

రాజారావు ఆమెను గురించి భార్యకు చెప్పాడు.

ఆమెను గురించి విని ఆశ్చర్యపోయింది.

"అయితే ఆమెను తప్పకుండా చూడాలి" అంది.

"అలానే" అన్నాడు రాజారావు.

ఆమె సౌశీల్యాన్నీ, గాఢాభిమానాన్నీ, పవిత్ర ప్రేమను ఊరు చేరుకునే వరకు తలంచుకొంటూనే 'ఆమెను ఎప్పుడు చూస్తానో కదా' అనుకొంది.

రాత్రి ఒంటిగంటకు రైలు ఊరు చేరింది.

రిక్షా కట్టించుకుని యింటికి వెళ్ళిపోయారు.

ఆ అపరిచితమైన ఆ ఊరును తొలిసారి చూడాలనుకునే ఆతృతలో ఆమె తలను ముందుకు చాచి రిక్షాలోంచి చుట్టూ చూస్తోంది కాని ఊరునిండా నల్లటి కాటుకలాంటి చీకటి! ఆమెకు ఏమీ కనిపించడంలేదు — ఎక్కడో అక్కడా అక్కడా చిన్నచిన్న వెలుతురు తప్ప.

ప్రయాణంలో అలసిపోవడంవల్లా, సగం రాత్రి పైబడేవరకూ నిద్ర లేకపోవడంవల్లా ఇంటికివెళ్ళి మంచంమీద చేరబడడంతోనే నిద్ర ఆవరించింది.

ఉదయం లేచేసరికి ఏడున్నర అయ్యింది.

సూర్యకిరణాలు వెచ్చగా కిటికీలోంచి మీద వాలుతున్నాయి.

లేవడంతోనే యిద్దరూ ఓమారు ఒళ్ళు విరుచుకుని ఆవలించి బద్ధకాన్ని పక్కమీదే వదిలేసి, దాన్ని మడతపెట్టి ఒక మూలకు చేర్చి నుంచున్నారు.

"ఏమండీ. ఆమెను చూపిస్తానన్నారు చూపించరూ ?" అంది రాజారావు భార్య.

"ఇదిగో చూడు" అంటూ అతను గబగబావెళ్ళి కిటికీ అద్దాల రెక్కలు బార్లా తెరిచాడు.

కాని, ఎదుటి మేడమీది కిటికీ తలుపులు దగ్గరగా మూసుకుని వున్నాయి!

రాజారావుకు ఆతృత ఎక్కువయ్యింది. ఆశ్చర్యం వేసింది. అలాంటి సమయంలో ఎప్పుడూ అవి మూసివుండగా అతను చూడలేదు.

అతని మనసు కీడును శంకిస్తోంది.

గబగబా రాజారావు మేడ వెనక భాగంలోకి వెళ్ళి దూరంగా స్మశానాల వైపు చూశాడు.

అతని భార్య కూడా ఆవెనకనేవచ్చి అతను చూస్తుండేవైపే ఏమీ తెలియక విచిత్రంగా చూస్తూ నుంచుంది—

స్మశానాలలో పవిత్రమైన గోదావరి నీళ్ళకు దగ్గర్లో దానివడ్డున ఎత్తయిన ఒక తెల్లటి పాలరాతి సమాధి పక్కనే మరో చిన్న సమాధి కొత్తగా నుంచొనివుంది!

"ఏదండీ ?" అంది ఆమె మళ్ళీ.

"అదిగో" అంటూ ఆ సమాధివైపు చూపుడువేలు సాచి చూపించాడు రాజారావు.

(1959)

★